క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వేంకటేశ్వరుని ప్రతిమ అందిస్తున్న సోమరాజు భరత్



జగన్‌మోహన్‌రెడ్డితో కౌన్సిలర్ దిలీప్

నరసాపురం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నరసాపురం పార్టీ యూత్ విభాగం నాయకులు ఇటీవల తాడేపల్లిలో కలిశారు. పార్టీ యూత్ విభాగం నాయకుడు టౌన్ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ సోమరాజు భరత్, 25వ వార్డు కౌన్సిలర్ జిల్లెళ్ల దిలీప్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు వెంట వెళ్లి అధినేతను కలిశారు. కూటమి పాలనలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పార్టీ అధినేత సూచించినట్టు చెప్పారు.

నేడు వైఎస్సార్ సీపీ పాలకొల్లు మండల విస్తృతస్థాయి సమావేశం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండలం వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశాన్ని శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణంలోని లయన్స్ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తామని మండల కమిటీ అధ్యక్షులు పెన్మెత్స ఏసురాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై అవగాహన కల్పించేందుకు మండల కమిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసరావు హాజరవుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పంట కాలువ అధ్వానం



చినమామిడిపల్లి వద్ద చెత్తతో పూడుకుపోయిన పంట కాలువ

నరసాపురం: పట్టణం మీదుగా చినమామిడిపల్లి–సరిపల్లి మీదుగా వెళ్లే పంట కాలువ అధ్వానంగా తయారైంది. పంటకాలువలో పూడిక పెరిగిపోయింది. అలాగే కాలువ నిండా చెత్తా పేరుకుపోయింది. దీంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని చినమామిడిపల్లి నుంచి కొప్పర్రు వరకూ సుమారు 500 ఎకరాల భూములకు, దాదాపు 40 గ్రామాలకు సాగు, తాగునీటి అవసరాలకు ఈ కాలువే దిక్కు. అయితే ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో నీరు పారడంలేదు. శివారు ప్రాంతాలకు అసలు నీరు చేరడంలేదు. వేసవిలో కాలువలు కట్టేసిన తరువాత కనీసం నీళ్లు వదిలిన తరువాత కూడా కాలువను శుభ్రం చేయలేదు. ఇప్పటికైనా కాలువ బాగు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ వ్యవస్థ పనితీరును తెలుసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న టౌన్ ఎస్సై జయలక్ష్మి

నరసాపురం: విద్యార్థులు పోలీసు వ్యవస్థ పనితీరు ఎలా ఉంటుంది? పోలీసులు ఎలా పనిచేస్తారు? అనే విషయాలను తెలుసుకోవాలని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని ఐరిస్‌ఫ్లోరిస్ట్ ప్లేస్కూల్ విద్యార్థులతో గురువారం పోలీస్ స్టేషన్స్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టౌన్‌స్టేషన్, రూరల్ స్టేషన్‌లకు విద్యార్థులను తీసుకెళ్లి పోలీసులు ఏంచేస్తారు? నేరాల అదుపు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? సీసీ కెమెరాల పనితీరు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై జయలక్ష్మి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. స్కూల్ కరస్పాండెంట్ వై.జాన్‌కుమార్, స్టేట్ క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నళిని తదితరులు పాల్గొన్నారు.

154 స్పౌజ్ పింఛన్ల మంజూరు

పెనుగొండ: పింఛను పొందే భర్త మరణించిన 154 మంది వితంతవులకు కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఆచంట ఎంపీడీఓ బి కృష్ణమోహన్ తెలిపారు. గురువారం ఆచంట ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. వారికి గాను రూ.6,16,000 బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి ఆగస్టు ఒకటో తేదీన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. పేదరిక నిర్మూలన పీ–4 నీడ్ అసిస్టెంట్ సర్వే వేగవంతం చేసి ఆగస్టు 3 నాటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.బులి సూరన్న, కార్యదర్శులు నాగబాబు, హనుమంతరావు, దుర్గా ప్రసాద్, జానకి, విజన్ టీం సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు బీమా ధీమా ఏది?

- పేరు మార్పుతో సరిపెట్టిన కూటమి ప్రభుత్వం
- ఏడాది గడచినా దరఖాస్తులు స్వీకరించని వైనం



యలమంచిలి మండలం మేడపాడు గ్రామ సచివాలయం

యలమంచిలి: కుటుంబ పెద్ద అకాలంగా మరణిస్తే ఇంటిల్లిపాది రోడ్డున పడాల్సిందే. అలాంటి సమయంలో అండగా నిలుస్తున్న వైఎస్సార్ బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రన్న బీమాగా పేరు మార్చడంతప్ప అమలుచేసింది లేదు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా కనీసం దరఖాస్తులు కూడా స్వీకరించకపోవడంతో అభాగ్యులకు చంద్రన్న బీమా పథకం ధీమా ఇవ్వలేకపోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మోసపూరిత హామీలిచ్చి ప్రజలతో ఓట్లు వేయించుకున్నారు. అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయకుండా గాలికి వదిలేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అకాల మరణం చెందిన వారి కుటుంబాలకు ఇస్తామన్న చంద్రన్న బీమా హామీనికూడా అమలు చేయకపోవడంతో ఆయా బాధిత కుటుంబాల కన్నీరే కూటమి ప్రభుత్వాన్ని మౌనంగా ప్రశ్నిస్తోంది.

మోసగించి.. మభ్యపెట్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షలు అందజేస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రజలను మభ్యపెట్టారు. అధికారం చేపట్టిన తర్వాత అభాగ్యులను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో గ్రామాలకు వెళ్తున్న కూటమి నేతలకు ప్రజల నుంచి చంద్రన్న బీమాపై ప్రశ్నల వర్షం కురుస్తుంది.

వెబ్‌సైట్‌ను తొలగించి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను తొలగించింది. అప్పటి నుంచి చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చిన వెబ్‌సైట్‌లో మృతి చెందిన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేయలేదు. బీమా దరఖాస్తులు స్వీకరించేందుకు ఆదేశాలు రాలేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. కుటుంబ యజమానులు, సభ్యులు కోల్పోయిన బాధితులు బీమా ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

జగనన్న పాలనలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ హయాంలో పేద బడుగు, బలహీనవర్గాల కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు వారు, 50 నుంచి 60 ఏళ్లలోపు వారు మృతి చెందితే రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు బీమా సొమ్ము మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. మిగతా సొమ్ము 15 నుంచి 20 రోజుల్లో నామిని బ్యాంకు ఖాతాల్లో జమయ్యేది. ఈ బీమా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేది. పేదలకు ఎంతో ఉపయోగపడిన వైఎస్సార్ బీమాను కేవలం పేరుమార్పుతో సరిపెట్టారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని అమలుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీమా మంజూరు చేయాలి



ఇంట్లో కుటుంబ సభ్యుడు, యజమానిని కోల్పోయిన మృతుల కుటుంబాలకు ఇచ్చిన హామీ మేరకు బీమా సొమ్మును మంజూరు చేయాలి. పలు కుటుంబాలు యజమానిని, కుటుంబ సభ్యులను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం బీమా సొమ్ము అందజేసి అండగా నిలవాలి.

– కడలి ఏడుకొండలు, బూరుగుపల్లి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రమాదవశాత్తూ మృతి చెందిన బాధిత కుటుంబాలు బీమా సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి పార్టీ నాయకులు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసింది.

– మామిడిశెట్టి చిట్టిబాబు, వడ్డిలంక

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేయాలి



గుడాల గోపితో మోహన్ యాదవ్

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీలను త్వరగా ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జిల్లా అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ కొలుసు మోహన్ యాదవ్ కోరారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపిని కలిసి కమిటీల గురించి వివరించారు. అనంతరం మోహన్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో వివిధ అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేసే విధంగా ఇన్‌చార్జిలను కలుస్తున్నామన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లాలో అన్ని కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ మరింత బలోపేతం చేస్తామన్నారు. గుడాల గోపి అతి త్వరలో నియోజకవర్గంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారని వివరించారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన లారీ

ఉండి: ఉండి శివారు పాముపలపర్రుకు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. పాములపర్రు వైపు నుంచి ఉండి వైపుగా వస్తున్న బాక్స్ లారీ అదే వైపున ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో దానిలో ఉన్న ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. దీంతో క్షతగాత్రులను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడవారు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి



బాడవ గ్రామ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మోసాలను ప్రజలకు వివరించడం ద్వారా వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలంతా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. బాడవ గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మారుమూల పల్లెలకు సైతం తీసుకెళ్లాలని ఆయన కోరారు. అనంతరం మండల కమిటీ, అనుబంధ కమిటీలు గురించి చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్‌బాబు, ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవి కుమార్, నాయకులు ఇలపకుర్తి నరసింహారావు (పండు) రావూరి రామకృష్ణ, ఇనుకొండ చిన్న, రావూరి శ్రీనివాసు, గెల్లు గణపతి, ఇంటి గంగాధర్, రాయి కృష్ణ, కూన శ్రీను, దిగమర్తి ఆగస్టీన్, దేవరపు కృష్ణ, ఇనుకొండ బాలాజీ, ఇనుకొండ ఏడుకొండలు, ఇంటి సత్యనారాయణ, ఇంటి రమేష్, పాలపర్తి సందీప్, మల్లుల కొండ, ఉల్లంపర్తి జాన్, దిడ్ల కుమార్, వీరా ఉమాశంకర్, గుడాల సురేష్, పోలుకొండ వెంకట్, సిర్రా నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సెలవుతో మండల సమావేశం వాయిదా



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్

యలమంచిలి: కూటమి నాయకుల ఒత్తిడితో అధికారులు పాలనకు సహకరించడం లేదని ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత నిర్వహించాలని, కానీ ఆమె ఉన్నట్టుండి సెలవు పెట్టడంతో ఎంపీపీ సమావేశాన్ని వాయిదా వేయించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ మార్చి 27, 28 తేదీల్లో నిర్వహించిన ఎంపీపీ ఎన్నికల సమయంలో అధికారులు కూటమి నాయకుల మాటలకు తలొగ్గి అన్యాయంగా ఎంపీపీ ఎన్నికను వాయిదా వేయించారన్నారు. దీంతో ఎంపీటీసీ సభ్యులంతా కోర్టును ఆశ్రయించడంతో, కోర్టు ఆదేశాల మేరకు మే 19న ఎన్నిక నిర్వహించారన్నారు. అనంతరం తాను మే 28న తాను బాధ్యతలు స్వీకరించే సమయంలో ఎంపీడీఓ సెలవు పెట్టారన్నారు. ఆ రోజు తనను మర్యాద పూర్వకంగా కలసిన 10 మంది అధికారులను కక్షకట్టుకుని బదిలీ చేయించారని మండిపడ్డారు. వారి స్థానంలో అధికారులు రాకపోవడంతో మండలంలో పాలన కుంటుపడిందన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులు

తాను ఎంపీపీగా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఈ రెండు నెలల కాలంలో మండలంలోని ఆరు గ్రామాలలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఏ కార్యక్రమానికి తనకు ఆహ్వానం పంపకుండా ప్రోటోకాల్ ఉల్లంఘించారన్నారు. ఎంపీపీ ఎన్నికకు ముందు వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న సమయంలో మండల పరిషత్ నిధులు రూ.78 లక్షలతో వివిధ గ్రామాలలో పనులు చేయుటకు నిధులు కేటాయించి తీర్మానం చేశారన్నారు. వాటికి ఇంత వరకు ఎస్టిమేట్లు వేయించలేదన్నారు. ఈ సమస్యలన్నింటిపై మాట్లాడడానికి సమావేశం ఏర్పాటు చేయాలని ఎంపీడీఓను తనతోపాటు ఎంపీటీసీ సభ్యులంతా కోరగా ఆమె గురువారం సమావేశం నిర్వహిస్తామని తెలిపారని పేర్కొన్నారు. తీరా ఎంపీటీసీ సభ్యులంతా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే సరికి ఆమె మళ్లీ సెలవు పెట్టారన్నారు.

సమాధానం చెప్పనంటున్న అధికారులు

సమావేశం 2 గంటలకు అయితే మూడు గంటలకు ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్ తన ఛాంబర్‌కు వచ్చి ఎంపీడీఓ సెలవు పెట్టారు. నేను సమావేశం నిర్వహిస్తాను, కానీ మీరు ఏమి అడిగినా నోట్ చేసుకుని ఎంపీడీఓకు చెబుతాను కానీ, సమాధానం మాత్రం చెప్పను అని చెప్పారన్నారు. ప్రస్తుతం మూడు అయ్యింది..నాలుగు గంటల లోపు సమావేశం మందిరంలోనికి వస్తే సమావేశం నిర్వహిస్తాను..లేకపోతే వాయిదా వేస్తానని ఆయన చెప్పారన్నారు. ఎంపీడీఓ ప్రేమాన్విత ఆరు నెలలు పాటు ప్రసూతి సెలవులకు వెళ్తున్నారన్నారు. ఈ విధంగా అధికారులు పాలనకు సహకరించకుండా అడ్డుకుంటున్నారని ఎంపీపీ ఆరోపించారు. గురువారం సమావేశం నిర్వహిస్తే మళ్లీ మూడు నెలలు వరకు సమావేశం నిర్వహించరని, అందుకే ఎఫ్ఏసీ ఎంపీడీఓ (ఎంపీడీఓ ప్రేమాన్విత ప్రసూతి సెలవులకు వెళితే) వచ్చాక సమావేశం నిర్వహించాలని ఎంపీటీసీ సభ్యుల సూచన మేరకు సమావేశం వాయిదా వేశామని ఆమె వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాసరావు, కొప్పాడి శ్రీనుబాబు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి, మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు కడలి వెంకట సుబ్బలక్ష్మీ, కంబాల సత్యశ్రీ, మానుకొండ చిట్టెమ్మ, కంబాల తిరుమల వెంకటేశ్వరరావు సర్పంచ్‌లు చల్లా లక్ష్మీ, పాలంకి శ్రీనివాసరావు, దంగేటి రాజమణి, అనిశెట్టి మల్లిక, మేడిది విజయ జ్ఞానమణి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు తొలగించే వరకు ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి

పెనుమంట్ర: గ్రామాల్లో బెల్ట్ షాపులు తొలగించే వరకు గీత కార్మికుల పోరాటం ఆగదని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అన్నారు. గురువారం పెనుమంట్రలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కామన మునిస్వామి మాట్లాడుతూ జిల్లాలో ఐదు వేల బెల్ట్ షాపులు ఉన్నాయని వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. బెల్టు షాపుల వల్ల గీత కార్మికుల కల్లు అమ్ముడుకాకపోవడంతో పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని బెల్ట్ షాపులు ఉంటే బెల్ట్ తీస్తామని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వాగ్దానం చేశారని గుర్తు చేశారు. తాడి, ఈత చెట్లపై నుంచి ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన, వికలాంగులైన వారికి ఒక రూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదని వాపోయారు. ఆదరణ పథకం పేరుతో గీత కార్మికులను ఆదుకుంటామని చెప్పినా ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. గీత కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బొక్క చంటి , దాసరి సూరిబాబు, జిల్లా నాయకులు బొంతు శీను, చింతపల్లి చిన్న వీరస్వామి, జక్కంచేతి సత్యనారాయణ రాజులపాటి సాంబశివరావు, వీరంకి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాట్ల సేవలు ఆదర్శనీయం



ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక

పెనుమంట్ర: కల్లుగీత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన ఎస్ఆర్ దాట్ల సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం అన్నారు. అత్తిలి మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర కల్లు గీత కార్మిక ఉద్యమ నేత స్వర్గీయ ఎస్ఆర్ దాట్ల 46వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన పెనుమంట్రలోని ఆయన స్మారక స్థూపం వద్ద సీపీఎం, కల్లు గీత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ దాట్ల కుటుంబ సభ్యులు నేటికీ ఎస్ఆర్ దాట్ల ట్రస్ట్ పేరుతో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ముందుగా బ్రాహ్మణ చెరువు సివిల్ సప్లైస్ గోడౌన్ నుంచి పెనుమంట్ర వరకు ర్యాలీగా బయలుదేరి స్మార్క స్థూపం వద్ద ఎస్ఆర్ దాట్ల తో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక లూథరన్ చర్చి వద్ద ఎస్ ఆర్ దాట్ల మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కు చెందిన బయోలాజికల్ ఇ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మూర్తి, డాక్టర్ డి.సందీప్ వర్మ, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక ప్రసన్న, చిలుకూరి రాఘవ రాజు సుందరి, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి పాల్గొన్నారు.

లైన్‌మేన్‌పై కొనసాగుతున్న విచారణ



అర్తమూరులో విచారణ చేస్తున్న విద్యుత్ అధికారులు

ఉండి: మండలంలోని అర్తమూరు, చెరుకువాడ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ లైన్‌మేన్ దాసరి రాజుపై అవినీతి ఆరోపణలు రావడంతో గురువారం అధికారులు రంగంలోకి దిగారు. ఉదయం నుంచి విద్యుత్‌శాఖ అధికారులు గ్రామంలోని పలువురు ఆక్వారైతుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. విద్యుత్ బిల్లుల్లో తేడాలు, మీటర్ రీడింగ్‌లో వ్యత్యాసాలపై వారిని ఆరా తీశారు. అయితే మరికొంత మంది ఆక్వా రైతులను విచారించాల్సి ఉందని శుక్రవారం విచారణ చేపడతామని తెలిపారు. దీనిపై రైతులు చెప్పిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో సమర్పిస్తామని ఏఈ పులగం శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రఘునాథ్‌బాబు, ఎస్ఈ, డీఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాపు వనిత క్లబ్ నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ వనిత సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ కావలి మౌని, సెక్రటరీ కటికి అర్చన, ట్రెజరర్ తోట గాయత్రిలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహన్, శిరిగినీడి రాజ్యలక్ష్మి, మద్దాల వాసు, యామన విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని విద్యుత్ లైన్లపైకి వచ్చిన చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం టౌన్ ఫీడర్ 1లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ ఏఈఈ కె మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పట్టణంలో యడ్లబజారు సెంటర్ నుంచి పెదగోపురం రోడ్డు, రామచంద్ర కాలనీ, పోస్టాఫీసు, బ్యాంకు స్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యలమంచిలిలో..

యలమంచిలి: కాజ విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం కొత్త హెచ్‌వీ బ్రేకర్ పెడుతున్న కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫర ఉండదని నరసాపురం డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధు కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాడవ, ఏనుగువానిలంక, కలగంపూడి, కాజా పడమర, కొంతేరు, అడవిపాలెం, అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. అలాగే ఇలపకుర్రు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం, ఇలపకుర్రు, గుంపర్రు, కాంభొట్లపాలెం, మట్లపాలెం, గంగడపాలెం, లక్ష్మీపాలెం, కట్టుపాలెం, వడ్డిలంక, నారినమెరక, చింతదిబ్బ గ్రామాలకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

నరసాపురం రూరల్: మొగల్తూరులోని ఓ లాడ్జిలో పేకాడుతున్నారనే సమాచారంతో గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు మొగల్తూరు ఎస్సై జి.వాసు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.16,700 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోవులకు రేడియం బెల్ట్‌లు

పాలకొల్లు సెంట్రల్: రోడ్డుపై తిరుగుతున్న గోవులు అనేక ప్రమాదాలకు గురవుతున్నాయని వాటిని రక్షించే ప్రక్రియలో భాగంగా గోవుల మెడలో రేడియం బెల్ట్‌లను వేసినట్లు పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొల్లి కొండప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి రోడ్డుపై తిరుగుతున్న గోవులకు రేడియం బెల్ట్‌లు వేశారు. ఈ సందర్భంగా కొండ ప్రసాద్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో వాహనాలు గోవులను ఢీకొట్టి వెళ్లిపోతున్నాయని అన్నారు. కాబట్టి వాటిని రక్షించాలనే సంకల్పంతో ఈ బెల్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి కుమార్, గవర పవన్ నాయుడు, బోడ కనకరాజు, చెరుకూరి శ్రీనివాస్, మల్లవోలు సురేష్, కీర్తిచంద్, జవ్వాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గూట్లపాడు గ్రామానికి చెందిన మోకా దాసుబాబు (57) కుటుంబ ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఈనెల 17 ఇంటి సమీపంలో చెట్టుకు నైలాన్ తాడుతో ఉరిపోసుకున్నాడు. స్థానికులు గమనించి నైలాన్ తాడును కోసి దాసుబాబును భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ నెల 24న మెరుగైన వైద్యం కోసం దాసుబాబును విజయవాడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దాసుబాబు గురువారం మృతి చెందాడు. ఆయన కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.